ఉచిత బస్సు.. ఇంకెంత దూరం..?

- మహిళల ఎదురుతెన్నులు
- మాటలకే పరిమితమైన హామీ
- మోసపోయామా? మహిళల నిట్టూర్పు



కొత్తపేట: ఏరు దాటే దాకా ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్లు ఉంది.. కూటమి నేతలు తీరు అని మహిళలు పెదవి విరుస్తున్నారు. ఎనిమిది నెలల పాలన గడిచినా మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీపైనా నిర్ణయం తీసుకోకపోవడంపై మోసపోయామని గ్రహించారు. ఎన్నికల వేళ టీడీపీ కూటమి నేతలు సూపర్‌–6 పేరిట విస్తృత ప్రచారంతో ఊదరగొట్టారు. అధికారం చేపట్టిన వెంటనే అన్నీ అమలు చేస్తామని అరచేతిలో వైకుంఠం చూపారు. విస్తృత ప్రచారం చేసి మహిళా ఓటర్లను ఆకట్టుకున్నారు. నిజమేనని నమ్మి మహిళలు ఓట్లేశారు. కానీ అధికారంలోకి వచ్చాక వాటి ఊసెత్తడమే మానేశారు. ఒక్క హామీ కూడా ఇప్పటి వరకు నెరవేర్చలేదు. ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒకటి. ఇప్పుడు మహిళలు ఆ హామీ ఉత్తిదేనా? మోసపోయామా? అని నిట్టూరుస్తున్నారు. జిల్లాలోని నియోజకవర్గాల్లో అధికంగా గ్రామీణ ప్రాంతాలు ఉన్నాయి. ప్రజలు వివిధ పనులు, కాలేజీలు, ఆస్పత్రులు, చిరు వ్యాపారాలు చేసుకోవడానికి నిత్యం మండల కేంద్రాలకు వెళ్తుంటారు. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో దాదాపు అన్నీ గ్రామీణ ప్రాంతాలే. ప్రధానంగా మహిళలు వివిధ వస్తువులు, సరకులు కొనుగోలు నిమిత్తం మార్కెట్లకు మండల కేంద్రాలకు, డివిజన్‌, జిల్లా కేంద్రానికి వెళ్లాలి. పేద, మధ్యతరగతి మహిళలు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో కూటమి నేతల ఉచిత బస్సు సౌకర్యంతో ప్రయాణం ఖర్చులు కలిసొస్తాయని ఆశించారు.

పండగల పేరుతో కాలయాపన : ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుకు పండగల పేరుతో కూటమి నాయకులు కాలయాపన చేస్తున్నారని మహిళలు విమర్శిస్తున్నారు. దసరా, దీపావళి, సంక్రాంతి అంటూ కప్పదాటు ప్రయత్నాలు చేస్తున్నారని ఎక్కడికక్కడ మహిళలు దుమ్మెత్తి పోస్తున్నారు. పండగలు వెళ్తున్నా ఉచిత ప్రయాణంపై స్పష్టమైన ప్రకటన మాత్రం పాలకుల నోటి వెంట రావడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాలయాపన తగదు



సూపర్‌–6లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్ర యాణం పథకాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే అమ లు చేయాలి. ప్రతి పండక్కి పథకం అమలు చేస్తామంటూ చెబుతున్నారే తప్ప ఆచరణ మాత్రం శూన్యం. మహిళలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ప్రజలు ఓట్లేశారు. ఇప్పుడు చూద్దాం.. చేద్దాం అంటూ కాలయాపన చేయడం సరికాదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ హామీపై మహిళలకు సమాధానం చెప్పాలి.

– కుర్రా లక్ష్మి, కొత్తపేట

నమ్మక ద్రోహం



కూటమి నేతల మాటలు నమ్మి మహిళలు ఓట్లేశారు. ఇప్పుడు హామీ అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారు. అమలు చేస్తారన్న నమ్మకం కూడా సన్నగిల్లుతోంది. ఇదిగో.. అదిగో అంటున్నారు.. కానీ ఉచిత బస్సు ప్రయాణంపై స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. నమ్మి ఓట్లు వేసిన వారిని మోసం చేయడం సరికాదు. మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి.

పోతుల చంద్రావతి, కొత్తపేట

దివ్యాంగుల సదుపాయాలపై సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్‌ సివిల్‌ జడ్జి ప్రమీలరాణి

రాజోలు: దివ్యాంగులకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్య సదుపాయాలపై సర్వే నిర్వహించేందుకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసినట్టు ఆ సంస్థ చైర్‌పర్సన్‌, సీనియర్‌ సివిల్‌ జడ్జి ప్రమీలరాణి తెలిపారు. మంగళవారం కమిటీ సభ్యులైన న్యాయవాదులు, పీహెచ్‌సీ వైద్యులు, పారా లీగల్‌ వలంటీర్లు, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. శారీరక, మానసిక దివ్యాంగులను గుర్తించి అవసరమైన వారికి సదరం ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసే విధంగా కృషి చేయాలన్నారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారాలను చూపాలన్నారు. ఐసీడీఎస్‌ సీడీపీఓ రమాదేవి, తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారులు ఫణికిరణ్‌, మణికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులతో కలసి పోరాడండి



జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన శిరీష్‌, మంగాదేవి

అయినవిల్లి: విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌, అమ్మకు వందనం విషయంలో వారి వెంట ఉండి ప్రభుత్వంపై పోరాటం చేయాలని వైఎస్సార్‌ సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి వెంకటసాయిశిరీష్‌ను మాజీ సీఎం, వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం జగన్‌ని శిరీష్‌, అయినవిల్లి వీరవల్లిపాలెం గ్రామ పీఏసీఎస్‌ మాజీ చైర్‌పర్సన్‌ మిండగుదిటి శ్రీలక్ష్మీ మంగాదేవి కలిసి చిరుజ్ఞాపిక అందజేశారు. తనను రెండోసారి జిల్లా వైఎస్సార్‌ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియమించినందుకు శిరీష్‌ కృతజ్ఞతలు తెలిపారు. శిరీష్‌ వెంట వైఎస్సార్‌ సీపీ నాయకులు శ్రీరెడ్డి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

వైభవంగా వార్షికోత్సవం

అంబాజీపేట: చిరతపూడిలో వేంచేసిన సీతారామాంజనేయ స్వామి వార్ల వార్షికోత్సవ వేడుకలు ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్‌ ఎల్‌ఆర్‌కే మూర్తి, కోశాధికారి ఇళ్ల ఏడుకొండలు పర్యవేక్షణలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మామిడిశెట్టి వెంకటరత్నం, చింతపల్లి వీరాంజనేయులు, సోమాలమ్మ దంపతులతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుండి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు, గ్రామస్తుల సహకారంతో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



గంగలకుర్రులో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అంబాజీపేట: ప్రస్తుత విభిన్న వాతావరణంలో ప్రతి ఒక్కరూ రోగాల బారిన పడుతున్న నేపథ్యంలో ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని అమలాపురం లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు లయన్‌ రవణం వేణుగోపాల్‌ అన్నారు. గంగలకుర్రు మోరంవారిపాలెం వద్ద ఉన్న అరిగెల కోనసీమ బృందావనం రిసార్ట్‌లో అరిగెల బలరామమూర్తి సహకారంతో లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో మెడివిన్‌ ఆస్పత్రి వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. 150 మంది రోగులకు ఈసీజీ, బీపీ, బ్లడ్‌షుగర్‌, కంటి పరీక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 10 మందికి కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేయగా, 30 మందికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మద్దెల వెంకటేశ్వరరావు, బెహరా హనుమంతరావు, జంపన సుమస్వర్మ, మద్దెల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలకు సత్కారం



వ్యాయామోపాధ్యాయులు ఎస్‌కే బాజీ, కె.సతీష్‌ కుమార్‌లను సత్కరిస్తున్న అధికారులు

సఖినేటిపల్లి: కాకినాడలో ఏపీ పీఈటీఎస్‌ శాప్‌ అసోసియేషన్‌ సెమినార్‌ కం స్పోర్ట్స్‌ మీట్‌ సందర్భంగా ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి వ్యాయామ ఉపాధ్యాయుల బ్యాడ్మింటన్‌ సింగిల్స్‌, డబుల్స్‌ విభాగాల్లో ప్రథమ స్థానం పొందిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్‌కే బాజీ, కె.సతీష్‌ కుమార్‌లను మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అలాగే అథ్లెటిక్స్‌ హైజంప్‌లో మూడో స్థానం, క్రికెట్‌లో విన్నర్‌ పతకాలు కూడా సాధించిన సతీష్‌ కుమార్‌కు మరిన్ని ప్రశంసలు వెల్లువెత్తాయి. మంగళవారం అంతర్వేది దేవస్థానంలో ఈ మేరకు స్థానిక ఎంఈఓ డి.కిషోర్‌కుమార్‌, ముమ్మిడివరం ఎంఈఓ ఉదయ భాస్కర్‌, రిటైర్డ్‌ ఎంఈఓ రమణశ్రీ వారిని సత్కరించారు. మండలానికి మంచి పేరు తీసుకురావడం సంతోషకరమని కిషోర్‌కుమార్‌, ఉదయ భాస్కర్‌, రమణశ్రీలు అన్నారు. వ్యాయామోపాధ్యాయులు శుభాకర్‌, కృష్ణప్రసాద్‌, స్కౌట్‌ క్యాంప్‌ ఆఫీసర్‌ సుబ్బరాజు పాల్గొన్నారు.

దానియేలు మృతి



జీవీ దానియేలు (ఫైల్‌)

పి.గన్నవరం: నాగుల్లంక శివారు పెద కందాలపాలెంలో నూతన జెరూసలెం మినిస్ట్రీస్‌ను ప్రారంభించి, దశాబ్దాలుగా కోనసీమ వ్యాప్తంగా సామాజిక సేవలు అందిస్తున్న ఆ సంస్థ అధినేత జీవీ దానియేలు (68) మంగళవారం బ్రెయిన్‌ స్ట్రోక్‌తో మరణించారు. ఆయన మృతితో తీవ్ర విషాదం నెలకొంది.

వైభంగా ఆలయ వార్షికోత్సవం



బొబ్బర్లంకలో ఆంజనేయస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకలో అభయ ఆంజనేయస్వామి వారి విగ్రహం, మందిరం 18వ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు, లక్ష తమలపాకులు, గంధసిందూరం పూజ, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. మండలంలో వివిధ గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

మాతృ, శిశు మరణాల నిర్మూలనకు పీఎంఎంఎస్‌ఏ



పెదపళ్లలో బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సాయికిషోర్‌

అలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌ (పీఎంఎంఎస్‌ఏ) పథకం విశేషంగా దోహదపడుతుందని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, డి.సాయికిషోర్‌ అన్నారు. పీఎంఎంఎస్‌ఏలో భాగంగా ఆయా పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన పీఎంఎంఎస్‌ఏ శిబిరంలో సుమారు 113 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు సుఖప్రసవాలు జరిగే విధంగా కృషి చేస్తున్న పీహెచ్‌సీల సేవలను ప్రజలకు తెలియజేయాలని వైద్యారోగ్య సిబ్బందికి వారు సూచించారు. మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల్లో మంగళవారం కుష్ఠు వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్‌, హెల్త్‌ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్‌, పి.ఉమ, ఆర్‌.బాలామణి పాల్గొన్నారు.

విద్యార్థుల కనీస అవసరాలు తీరుస్తాం



పెనికేరులో విద్యార్థులకు స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేస్తున్న ఏజీపీ విద్యాప్రసన్న

అలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని మండల ప్రజా పరిషత్‌ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉమెన్‌ డెవలప్‌మెంట్‌ ట్రస్టు కనీస అవసరాలను తీర్చుతుందని ఆ సంస్థ అధ్యక్షురాలు, ఏజీపీ బూసి విద్యా ప్రసన్న అన్నారు. పెనికేరులోని ఎంపీపీ పాఠశాలలో ట్రస్టు తరఫున ఆమె విద్యార్థులకు భోజనం ప్లేట్లు వాటర్‌ బాటిళ్లు, పుస్తకాలు, స్టేషనరిని పంపిణీ చేశారు. విద్యార్థులందరూ చక్కటి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చక్కని పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో ఇప్పటికే పుస్తకాలు, స్టేషనరీ వస్తువు పంపిణీ పూర్తయిందని ఏజీపీ విద్యాప్రసన్న పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు ముంగమూరి దాసు, ఉపాధ్యాయుడు సింగారపు రామారావు, గొడవర్తి భాస్కరరావు, కోన దత్తుడు, ముప్పిరి వెర్రియ్య తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోకు సత్కారం



వీఆర్వో అబ్బులును సత్కరిస్తున్న తహసీల్దార్‌ శ్రీపల్లవి

పి.గన్నవరం: ఇటీవల అనంతపురం జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్ల అథ్లెటిక్స్‌లో షార్ట్‌పుట్‌, హ్యామర్‌త్రో విభాగాల్లో సిల్వర్‌, బ్రాంజ్‌ మెడల్స్‌ సాధించిన వై.కొత్తపల్లి వీఆర్వో తాతపూడి అబ్బులును మంగళవారం తహసీల్దార్‌ పి.శ్రీపల్లవి, వీర్వోలు ఘనంగా సత్కరించారు. అలాగే మండలంలోనీ వీఆర్వోలు ఆయన్ను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీటీ ఎం.సత్యనారాయణ, ఆర్‌ఐ యన్నవు డాంగే, ఎలక్షన్‌ సీనియర్‌ అసిస్టెంట్‌ స్వామీజీరావు, సీనియర్‌ అసిస్టెంట్‌ విష్ణుమూర్తి, వీఆర్వోల సంఘ అధ్యక్షుడు పి.నరసింహారావు, శివరామకృష్ణ, దొరబాబు, రమేష్‌, దుర్గ, పద్మావతి, వీఆర్‌ఏల సంఘ నాయకులు కె.రాజు, ఎ.శ్రీకృష్ణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

పి.గన్నవరం: ముంగండ గ్రామంలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి సిబ్బంది ఈ సందర్భంగా 78 మందికి కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వారిలో 15 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడానికి నిర్ధారించినట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కంటి ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామకంఠం సమస్య పరిష్కరించాలి

అలమూరు: మండలంలోని మడికి శివారు చిలకలపాడుకు చెందిన గ్రామ కంఠం భూమి–వక్ఫ్‌ బోర్డు సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వక్ఫ్‌ బోర్డ్‌ ఆడిటర్‌ ఇన్‌స్పెక్టర్‌ మహ్మద్‌ షఫీవుల్లా, వక్ఫ్‌ బోర్డ్‌ ప్రత్యేక అధికారి షేక్‌ రసూల్‌ జానీతో సమావేశమై గ్రామస్తులు ఎదుర్కొంటున్న దుస్థితిని క్షుణ్ణంగా వివరించారు. గ్రామస్తులు మాట్లాడుతూ మడికి ఉప గ్రామమైన చిలకలపాడులో వక్ఫ్‌ భూమి ఉందంటూ అలమూరు సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలో ఆగ్రామానికి సంబంధించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తిగా నిలిపి వేశారన్నారు, దీనిపై సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాన్ని సంప్రదించగా రాజమహేంద్రవరంలోని వక్ఫ్‌ బోర్డు ఈమేరకు 206/03 సర్వే నంబరులో ఉన్న భూముల్లో రిజిస్ట్రేషన్లు చేయవద్దని ఫిర్యాదు చేసినందు వల్లే నిలిపివేశామన్నారు. పూర్వం నుంచి భవనాలను నిర్మించుకుని ఏళ్ల తరబడి నివాసముంటున్న ఆ గ్రామంలో రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో క్రయ విక్రయాలు జరగక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు కాని అధికారులను కాని పట్టించుకోకపోవడంతో చివరకు వక్ఫ్‌ బోర్డును ఆశ్రయించామన్నారు. చిలకలపాడుకు సంబంధించి 2018 వరకూ సాగిన రిజిస్ట్రేషన్లు తదనంతరం వారసత్వ మార్పులు కూడా చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం చెబుతున్నట్లుగా గ్రామంలో ఆ సర్వే నంబర్‌కు సంబంధించి కేవలం 8.88 సెంట్లు భూమి లేదన్నారు. శ్మశానవాటిక ఉన్న 0.27 సెంట్లు భూమి మాత్రమే వక్ఫ్‌ బోర్డుకు చెందిందన్నారు. దీనిపై అధికారులు సత్వరమే స్పందించి వక్ఫ్‌ బోర్డు ఆస్తులపై సమగ్ర విచారణ చేసి గ్రామంలో గతంలో మాదిరిగానే రిజిస్ట్రేషన్లు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. దొండపాటి సుబ్బరాజు, కొత్తపల్లి బుజ్జి, చెక్కపల్లి చిట్టిబాబు, కొత్తపల్లి వెంకన్న, గంగిశెట్టి దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యా సంస్థలపై ఒత్తిడి తగదు



మామిడికుదురు ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న ప్రైవేటు విద్యా సంస్థల ప్రతినిధులు

మామిడికుదురు: ప్రైవేటు విద్యాసంస్థలకు ఫారం–1 అప్‌డేషన్‌పై ఎంఈఓల నుంచి ఒత్తిడి వస్తోందని, ఇది తగదని కోనసీమ జిల్లా సంఘం అధ్యక్షుడు ఎన్వీ రమణారావు పేర్కొన్నారు. ఎంఈఓల నుంచి వస్తున్న ఆదేశాలు తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నాయన్నారు. మామిడికుదురు ఎంఈఓ లక్ష్మీనారాయణను మంగళవారం కలసి వినతిపత్రం ఇచ్చారు. ఫారం–1 అప్‌డేషన్‌పై హైకోర్టును సంప్రదించామన్నారు. 2011 దీనిపై హైకోర్టు స్టే ఇచ్చిందని తెలిపారు. నాటి నుంచి స్టే అమల్లో ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒత్తిడి ఎక్కువైన కారణంగా మళ్లీ హైకోర్టును ఆశ్రయించామన్నారు. దీనిపై హైకోర్టు మార్చి 6వ తేదీకి వాయిదా వేసిందన్నారు. ఈ నేపథ్యంలో రాజోలు డివిజన్‌ పరిధిలోని అయిదు మండలాల ఎంఈఓలను కలసి వినతిపత్రాలు అందించామన్నారు. వినితి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా సెక్రటరీ టీఎస్‌ఆర్‌ అయ్యప్పనాయుడు, డివిజన్‌ అధ్యక్షుడు రత్నరాజు, జిల్లా ట్రెజరర్‌ శ్రీనివాస్‌, డివిజన్‌ కార్యదర్శి చిన్న, ప్రసాద్‌, గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

ఘనంగా చండీహోమం



సిరిపల్లిలో చండీహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

అయినవిల్లి: మండలంలోని సిరిపల్లిలో మంగళవారం సిరిపల్లమ్మ ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. టీటీడీ వేదపండితుడు అల్లవరపు సుబ్రహ్మణ్యదీక్షితావధాని ఆధ్వర్యంలో రుత్విక్కులు ఈ పూజ నిర్వహించారు. అమ్మవారి సామూహిక సహస్ర కుంకుమ పూజలు జరిపారు. 108 కలశాలతో కుంభాభిషేకం, చండీ సప్తస్థితిహోమం, మహాపూర్ణాహుతి, ఆశీర్వచనం వంటి విశేష పూజలు జరిపారు. సాయంత్రం భారీ అన్నసంతర్పణ చేశారు.

ప్రజలకు సేవలందించాలి

అయినవిల్లి: ప్రజలకు ప్రతిష్ఠాత్మకంగా సేవలందించాలని ఎంపీడీఓ జి.భీమారావు అన్నారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఉద్యోగులతో సమీక్షించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం పథకాల నేరుగా ప్రజలకు అందాలన్నారు. ప్రభుత్వ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం కోరిన సమాచారం సత్వరం అందించాలన్నారు. ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు.

విహాస్‌కు గన్నవరపు పరామర్శ



విహాస్‌ను పరామర్శిస్తున్న కో ఆర్డినేటర్‌ శ్రీనివాసరావు

అంబాజీపేట: ఇటీవల అంబాజీపేట కముజువారిపేటలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌ సీపీ నాయకుడు ఉందుర్తి నాగబాబు కుమారుడు విహాస్‌ను వైఎస్సార్‌ సీపీ పి.గన్నవరం కో ఆర్డినేటర్‌, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మంగళవారం పరామర్శించారు. విహాస్‌ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మనోధైర్యం కల్పించారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన వక్కలంక పార్టీ నాయకులు జనుపల్లి ఏడుకొండలను కోఆర్డినేటర్‌ శ్రీనివాస్‌ పరామర్శించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్‌, జిల్లా సోషల్‌ మీడియా కో ఆర్డినేటర్‌ దొమ్మేటి సత్యమోహన్‌, వాసంశెట్టి పెదబాబు, అప్పన శ్రీను, పిల్లి రమేష్‌, కుసుమ శ్రీనివాస్‌, మట్టపర్తి హరి పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఉద్యాన పంటల సాగుపై ముగిసిన శిక్షణ



కేదార్లంకలో ప్రజాప్రతినిధులు, అభ్యుదయ రైతులతో ఉద్యాన కళాశాల విద్యార్థినులు

కొత్తపేట: పశ్చిమగోదావరి జిల్లా వెంకటరామన్నగూడెం డాక్టర్‌ వైఎస్సార్‌ ఉద్యాన విశ్వవిద్యాలయం–ఉద్యాన కళాశాల విద్యార్థినులు కోనసీమ జిల్లాలో 40 రోజుల క్షేత్రస్థాయి శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఉద్యాన కళాశాలలో డిగ్రీ చదువుతున్న 23 మంది విద్యార్థినులు గ్రామీణ ఉద్యాన పని అనుభవ పథకంలో భాగంగా అంబాజీపేట ఉద్యాన పరిశోధన స్థానానికి పంపించారు. వారిని కొత్తపేట ఏరియా ఉద్యాన అధికారి జి.కోటేశ్వరరావు ద్వారా కొత్తపేట మండలం వానపల్లి, కపిలేశ్వరపురం మండలం కేదార్లంక గ్రామాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్న 23 మంది అభ్యుదయ రైతులకు కేటాయించారు. సుమారు నాలుగు నెలలు పాటు ఉద్యాన కళాశాల విద్యార్థినులు ఆయా గ్రామాల్లోనే నివాసం ఉండి ఉద్యాన పంటల సరళి, గ్రామ ఆర్థిక స్థితిగతులు, పంటల విస్తరణ తదితర అంశాల గురించి శిక్షణ పూర్తి చేసుకుని తిరిగి కళాశాలకు వెళ్లారు. కేదార్లంక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్‌ వీది వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వారికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. 40 రోజులు తమకు అన్ని విధాలుగా సహకరించిన రైతులు, ప్రజాప్రతినిధులకు విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, కొత్తపేట నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు, అంబాజీపేట పరిశోధన స్థానం అధిపతి చలపతిరావు, శాస్త్రవేత్త నీరజ, ఉద్యాన అధికారి జి.కోటేశ్వరరావు, స్థానిక నాయకులు, రైతులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పౌర్ణమి స్నానాలకు ఏర్పాట్ల పరిశీలన



బీచ్‌ వద్ద పూజలు నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీమోహన్‌

సఖినేటిపల్లి: అంతర్వేది తీర్థమహోత్సవాల్లో తొమ్మిదో రోజు బుధవారం మాఘ పౌర్ణమి సందర్భంగా బీచ్‌ వద్ద సముద్రంలో స్వామిని స్నానం చేయించే సమయంలో తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లను, భక్తులకు సంబంధించి ఇతర ఏర్పాట్లను రెవెన్యూ, పోలీసు, దేవస్థానం అధికారులు మంగళవారం పరిశీలించారు. సముద్ర స్నాన ఘట్టాల వద్ద ఏర్పాట్లు, బీచ్‌లో జల్లు స్నానం ఏర్పాట్లను పర్యవేక్షణాధికారి, రామచంద్రపురం ఆర్డీవో అఖిల పరిశీలించారు. జల్లు స్నానం క్యూ గురించి ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, ఆర్డీవోకు వివరించారు. అలాగే స్నానం అనంతరం స్వామి వారు సేదతీరే వసంత మండపం, ఆలయం వద్ద తెప్పోత్సవానికి ఏర్పాటు చేస్తున్న చెరువు పనులను ఆర్డీవో అఖిల పరిశీలించారు. కాగా ఒడ్డున స్వామికి నిర్వహించే విశేషపూజల స్థలాన్ని, స్వామిని సముద్రం స్నానానికి తీసుకువెళ్లే మార్గం గురించి కొత్తపేట డీఎస్పీ ఎస్‌.మురళీ మోహన్‌, ఆలయ ఏసీ వి.సత్యనారాయణతో సమీక్షించారు. అలాగే ఒడ్డున భక్తులకు గతంలో మాదిరిగా జల్లు స్నానం ఏర్పాట్లును కూడా వారు పరిశీలించారు. వీటితో పాటు సముద్రంలో స్వామితో పాటు స్నానం చేసే సమయంలో తొక్కిసలాట లేకుండా భక్తుల భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యలను డీఎస్పీ పరిశీలించారు. ఇదిలా ఉండగా ఒడిశా రాష్ట్రానికి చెందిన పలువురు విద్యార్థినులు అంతర్వేది ఆలయంలో స్వామివారిని దర్శించుకుని, ఆలయంలోని వేప చెట్టు వద్ద దీపారాధనలు చేశారు.

బంగారం సేవలు అభినందనీయం



కొత్తపేటలో ఉత్తమ విద్యార్థినికి నగదు, ప్రశంసాపత్రం అందజేస్తున్న ఆర్డీవో శ్రీకర్‌

కొత్తపేట: ఉత్తమ విద్యార్థులపై సాధారణ ప్రైవేట్‌ ఉద్యోగి మారుతీబంగారం దృక్పథం, సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆర్డీవో పి.శ్రీకర్‌ అన్నారు. మండలంలోని పలివెలలో అభయాంజనేయస్వామి మందిరం ఫౌండర్‌ విన్నకోట వీఎస్‌ఎన్‌ మారుతీ బంగారం ఏటా ఆ గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తుంటారు. దానిలో భాగంగా 2023–24 విద్యా సంవత్సరం పదో తరగతి పబ్లిక్‌ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతుల ప్రదానాన్ని మంగళవారం ఆర్డీవో శ్రీకర్‌ చేతుల మీదుగా నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన మల్లవరపు పౌర్ణమికి రూ.3 వేలు, నల్లా నిహారికకు రూ.2 వేలు, కత్రు ఆశీష్‌కు రూ.1500 నగదుతో పాటు దుస్తులు, పుస్తకాలు అందజేశారు. ప్రభుత్వం, దాతలు, స్వచ్ఛంద సంస్థలు కల్పిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు ఆయన ఉద్బోధించారు.

ఈ–శ్రమ్‌తో బహుళ ప్రయోజనాలు



ఆలమూరులో ఇటుక బట్టీ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న నాగ మల్లేశ్వరరావు

ఆలమూరు: అసంఘటిత రంగాల కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ ఉపాధి పథకాలను చేరువ చేసేందుకు కేంద్రం తీసుకొచ్చిన పథకం ఈ–శ్రమ్‌ను కార్మికులందరూ ఉపయోగించుకోవాలని మండపేట సహాయ కార్మికశాఖ అధికారి కాశీ నాగ మల్లేశ్వరరావు సూచించారు. ఆలమూరులో మంగళవారం ఆయన పర్యటించి పలు ఇటుక బట్టీలను పరిశీలించారు. ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులతో ఆయన మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బట్టీల వద్ద రికార్డులను పరిశీలించారు. పలు ఇటుక బట్టీల వద్ద రికార్డులను పరిశీలించి అందులో ఉన్న లోపాలన సవరించుకోవాలని యజమానులకు సూచించారు. 14 ఏళ్లలోపు చదువుకునే పిల్లలను పనిలో నియమించుకుంటే చర్యలు తప్పవన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఇటుక బట్టీ యజమానులకు సూచించారు.

మాఘపౌర్ణమికి ప్రత్యేక బస్సులు

రావులపాలెం: మాఘ పౌర్ణమికి సంబంధించి రావులపాలెం డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్‌ జీజీవీ రమణ మంగళవారం తెలిపారు. అంతర్వేది, అన్నవరం, ద్రాక్షారామ పుణ్యక్షేత్రాలకు ప్రతి గంటకి ఒక సర్వీస్‌ ఉండేలా బస్సులు నడుపుతున్నామన్నారు. బుధవారం నుంచి ఈ సర్వీసులు మొదలవుతాయని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.